క్లుప్తంగా

మాతృభాష గొప్పది

ఎచ్చెర్ల: మాతృభాష గొప్పదని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ముద్దాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మణిపాత్రుని నాగేశ్వరరావు అన్నారు. మాతృభాష దినోత్సవ వేడుకల్లో పాల్గొని వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. మాతృభాష మాధుర్యం, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ల ప్రవేశాలకు అవకాశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంటర్మీడియట్ డ్రాపౌట్ విద్యార్థులకు ఓపెన్ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఎచ్చెర్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.ఎల్ నారాయణరావు శనివారం తెలిపారు. ఈ నెల 27లోగా పూర్తిస్థాయి ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

లావేరు : అదపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులు లక్ష్మణరావు, స్వరాజ్యలక్ష్మి, సత్యకృష్ణ, విజయపాణిగ్రాహిలకు శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పాటించాలి



మౌలిక వసతులపై ఆరా తీస్తున్న అధికారులు

జి.సిగడాం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల కోడ్ విధిగా పాటించాలని జోనల్ ఎన్నికల అధికారి వై.బాల్జీ సూచించారు. శనివారం జి.సిగడాం మండల పరిషత్ పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్ఓ భూపతి నర్సింగరావు, హెచ్ఎం శీర రాము, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోడిసాగు పరిశీలన



చోడి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

జి.సిగడాం: మండలంలోని జి.సిగడాం, జగన్నాథవలస, ఎస్.పి.ఆర్‌పురం, సంతవురిటి, గొబ్బూరు గ్రామాల్లో సాగవుతున్న చోడి(రాగి) పంటను వ్యవసాయశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. నీరు పుష్కలంగా అందడం, ప్రభుత్వం రాయితీలతో విత్తనాలు పంపిణీ చేయడంతో ఎక్కువ మంది రైతులు చోడిసాగుపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రణస్థలం వ్యవసాయశాఖ ఏడీఏ వడ్డాది శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి యర్రా శారద, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మీనారాయణ, అంపోలు అనూష, ముంతా హరీష్ పాల్గొన్నారు.


సాహితీ బ్రహ్మోత్సవ కమిటీ ఆర్గనైజింగ్ సభ్యునిగా ఈవేమన



ఈవేమన

శ్రీకాకుళం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాజీ చారిటబుల్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల సాహితీ కమిటీ ఆర్గనైజింగ్ సభ్యులుగా ఈవేమన (మహ్మద్ రఫీ) ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 9, 10 తేదీల్లో జరిగే సాహితీ బ్రహ్మోత్సవాలకు ఈవేమనను ఎంపిక చేయడం పట్ల కవితా నిలయం ప్రధాన కార్యదర్శి ఉమాకవి, శరత్‌బాబు, కె.వి.రాజారావు హర్షం వ్యక్తం చేశారు.

కల్యాణ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు




పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలతో పూజలు, నగరవీధుల్లో హరినామ సంకీర్తనలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

- రూ.95 లక్షలతో పొట్టి శ్రీరాములు మార్కెట్, పరిసరాల అభివృద్ధి
- వైఎస్సార్, సీఎం జగన్ పాలనలోనే ప్రగతి
- టీడీపీ హయాంలో పట్టించుకోని చంద్రబాబు

ప్రగతిపథంలో పెద్ద మార్కెట్



శ్రీకాకుళం పెద్దమార్కెట్ సమీపంలో నిర్మించిన రోడ్డు

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు పెద్దమార్కెట్ అభివృద్ధిపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన తర్వాత ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మార్కెట్‌లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. 2004 ముందు వరకు 70 ఏళ్లకు పైబడి శిథిలావస్థకు చేరుకున్న భవనాలు దర్శనమిచ్చేవి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి మార్కెట్ దుస్థితిని అప్పటి, ఇప్పటి రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీసుకెళ్లడంతో రూ.4 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో మార్కెట్ భవనాలు, చేపల మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించారు.



అభివృద్ధి కాక ముందు రోడ్డు దుస్థితి

హామీ విస్మరించిన చంద్రబాబు...

2004కు ముందు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు శ్రీకాకుళం పర్యటనకు వచ్చి ఆకస్మిక తనిఖీ అంటూ పెద్ద మార్కెట్‌లో పర్యటించారు. అక్కడి మార్కెట్ శిథిలావస్థకు చేరుకోవడం చూసి కోటి రూపాయలతో కొత్త భవనాలు నిర్మింపజేస్తామని బహిరంగంగా ప్రకటించారు. అటు తరువాత పట్టించుకోలేదు.

మరిన్ని అభివృద్ధి పనులు

మార్కెట్ పరిసరాల రోడ్డుతోపాటు పాతబస్టాండ్‌ను రూ.95 లక్షలతో అభివృద్ధి చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతోపాటు మున్సిపల్ నిధులతో పనులు చేపడుతున్నాం. ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.
– చల్లా ఓబులేసు, నగరపాలక సంస్థ కమిషనర్

ఇదే సందర్భంలో అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ దూడ భవానీ శంకర్‌ను కాలువలో వేసి తొక్కేస్తానంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. మార్కెట్ మరింత శిథిలావస్థకు చేరుకోవడంతో వ్యాపారం చేసుకునేందుకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రూ.95 లక్షలతో అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పెద్ద మార్కెట్ పరిసరాల్లో రోడ్లు మరింత అభివృద్ధి చెందాయి. ఇటీవల రూ.95 లక్షలతో 954 మీటర్ల సీసీ రోడ్లు నిర్మించారు. అంతకుముందు ఈ రోడ్లన్నీ అధ్వానంగా నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉండేవి. ఇప్పుడు రోడ్లన్నీ సుందరంగా మారాయి.

ఘనంగా భక్తిగీతాలాపన



గీతాలాపనలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కత్తెర వీధిలో మెహెర్ కేంద్రంలో అవతార్ మెహెర్‌బాబా 123వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన కిలారు నాగార్జున మాట్లాడుతూ ప్రేమతత్వాన్ని పెంచాలనే బాబా వాక్యంతో సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎం.సీతారామమూర్తి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో బాబా ప్రేమను పొందాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తిగీతాలాపన ఆకట్టుకుంది. అనంతరం వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పి.వి.రంగప్రసాద్, వి.శ్రీకుమార్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియాను బహిష్కరించాలి



ఈనాడు పత్రికలతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

లావేరు: ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్న ఎల్లో మీడియాను సమాజం నుంచి బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు లుకలావు అప్పలనాయుడు అన్నారు. లావేరు మండలం వెంకటాపురం వైఎస్సార్ కూడలిలో శనివారం ఈనాడు పత్రికలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు నాయకుడు చంద్రబాబుకు మద్దతుగా ఎల్లో మీడియా తప్పుడు వార్తలు రాస్తోందని దుయ్యబట్టారు. 2021 నాటి ఫొటోలతో పట్టాభిని కొట్టారని వార్త ప్రచురించడం దారుణమన్నారు. నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు వట్టి సత్యనారాయణ, గొర్లె రామి నాయుడు, శివంగం నాగరాజు, వాల్లే పెద్దదాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు వరుణ్



మంత్రి సీదిరితో డాక్టర్ చింతాడ వరుణ్

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చింతాడ వరుణ్ శనివారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2024లోనూ పార్టీ అధికారంలోకి వచ్చేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు



జీరుపాలెం విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య

రణస్థలం: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని జిల్లా ఉప విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. రణస్థలం మండలం జీరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. నాడు–నేడు ఫేజ్–2లో భవనాలు మంజూరైనా నిర్మాణంలో స్థల సమస్యతో జాప్యం జరగడం సరికాదని స్థానిక నాయకులు మాగుపల్లి రాముడు, మైలపల్లి కామరాజులతో అన్నారు. అవసరమైన స్థలాన్ని పరిశీలించి భూ పత్రాలు త్వరగా సమర్పించాలని, లేదంటే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని చెప్పారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించి పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.రామారావు, నాయకులు మైలపల్లి చిన్న, సూరాడ కైలేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనుంజయరావు

రణస్థలం: ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను క్షేత్రస్థాయిలో సకాలంలో పూర్తి చేసి నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఎంపీడీఓ ధనుంజయరావు సిబ్బందికి సూచించారు. కోష్ట పంచాయతీ సచివాలయాన్ని శనివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎస్‌డీజీ సర్వే, పీఆర్ సర్వేలపై ఆరా తీశారు. పెండింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎం.మోహన్‌రావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలి



ఎంపీపీ చిరంజీవి అధ్యక్షతన సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలని పలువురు సభ్యులు కోరారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతలకోడూరు, బడివానిపేట ఎంపీటీసీ సభ్యులు మాడుగుల జగదీశ్వరరావు, కొమర సామయ్య, మాడుగుల స్వాతి, కేశవరావుపేట సర్పంచ్ పైడి భాస్కరరావు మాట్లాడుతూ సింగూరు సమీకృత రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య స్పందిస్తూ ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి పథకాల మరమ్మతులకు అంచనాలు సైతం సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

- ప్రజాప్రతినిధులు కొన్ని ప్రశ్నలు అడుగుతుండగా.. ఎంపీపీ స్పందిస్తూ నిబంధనలు మేరకు 15 రోజుల ముందు ప్రశ్నలు తెలియజేస్తే అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇస్తారని చెప్పారు. ఈ విషయమై పలువురు ప్రజా ప్రతినిధులు స్పందిస్తూ గ్రామీణ సమస్యల ప్రస్తావనకు ముందస్తు అనుమతులు అవసరమా అంటూ అసహనం వ్యక్తం చేశారు.
- కుప్పిలి ఎంపీటీసీ బల్లాడ జనార్దనరెడ్డి మాట్లాడుతూ కుప్పిలిలో పాఠశాల ముందు స్థలం ఆక్రమణకు గురైందని ఎన్నిసార్లు సభలో ప్రస్తావించినా, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ ఎస్.బాలకృష్ణ స్పందిస్తూ ఉన్నతాధికారులు దృష్టికి సమస్య తీసుకువెళతామని చెప్పారు. అనంతరం పలు సమస్యలపై సభ్యులు ప్రస్తావించారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జరుగుళ్ల విజయకుమారి, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, సీనియర్ అసిస్టెంట్ కిలారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, గత సమావేశాల్లో శాంతి భద్రతల సమస్యలు ఏర్పడటం వల్ల జేఆర్ పురం సీఐ ఆదాం, ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు భద్రత ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రీన్‌డే



అవగాహన కల్పిస్తున్న కార్యకర్త

రణస్థలం: ప్రపంచ పర్యావరణ మాసోత్సవాల సందర్భంగా శనివారం రణస్థలం మండలం చిల్లపేట రాజాం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రీన్‌డే నిర్వహించారు. పర్యావరణం ఆవశ్యకత, చెట్లు పెంపకం వల్ల కలిగే లాభాలను అంగన్‌వాడీ కార్యకర్త రమ చిన్నారులకు వివరించారు.

తెలియక చేశామంటే చట్టం అంగీకరించదు

- అశ్లీల వీడియోలు పంపినా.. చూసినా నేరమే
- అవగాహన సదస్సులో దిశా డీఎస్పీ వాసుదేవ్



బాలికోన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దిశా డీఎస్పీ వాసుదేవ్

శ్రీకాకుళం క్రైమ్ :

అశ్లీల వీడియోలు మొబైల్‌లో చూసినా, వేరే వారికి మళ్లీ పంపించినా నేరమేనని.. అనుకోకుండా చూశాం, పంపించామంటే చట్టం అంగీకరించదని శ్రీకాకుళం దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.వాసుదేవ్ స్పష్టం చేశారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు శ్రీకాకుళం బాలికోన్నత పాఠశాలలో శనివారం మానవ అక్రమ రవాణా విభాగం పోలీసుల ఆధ్వర్యంలో బాలల హక్కులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీపీయూ, ఎన్‌సీఎల్‌పీ, లేబర్ విభాగాల సంయుక్త సిబ్బంది సమక్షంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఆర్.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎవరు పార్టీలకు పిలిచినా అక్కడ మత్తు పానీయాలు తాగరాదని, ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పేవారిని నమ్మవద్దని హితవు పలికారు. ఎక్కువగా ఎనిమిది నుంచి ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థినులు లైంగిక వేధింపులకు అత్యధికంగా గురవుతున్నారని చెప్పారు. ఎటువంటి వేధింపులు ఎదురైనా తల్లిదండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ చెప్పారు. పరువు పోతుందని ఆలోచిస్తే నష్టం తప్పదన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. అశ్లీల చిత్రాలు (వీడియోలు) మొదటిసారి మొబైల్‌లో పంపిస్తే ఐదేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా ఉంటుందని, అవి చూసిన రెండో వ్యక్తి వేరే వారికి పంపినా ఇదే శిక్ష వర్తిస్తుందని హెచ్చరించారు. మళ్లీ రెండోసారి ఇదే కేసులో ఇరుక్కుంటే ఏడేళ్లకు శిక్ష పెరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో లైంగిక వేధింపులకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. పోక్సో, దిశా చట్టం కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. కాగా, సాయంత్రం స్కూల్ వదిలే సమయంలో ఆకతాయి కుర్రాళ్లు విపరీతంగా బైక్‌లపై రౌండ్లు వేస్తూ బాలికలకు ఇబ్బంది పెడుతున్నారని హెచ్ఎం చెప్పారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తామని డీఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దిశా ఎస్ఐ ఎ.చంద్రశేఖర్, ఏహెచ్‌టీయూ ఎస్ఐలు ఎస్.కేశవరావు, ఎల్.వెంకటరావు, ఎన్‌సీఎల్‌పీ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలకృష్ణ, దిశా ఉమెన్ పీసీ జి.కళావతి పాల్గొన్నారు.



నారాయణ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏహెచ్‌టీయూ ఎస్ఐ కేశవరావు

సోదరభావంతో మెలగాలి

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థినుల పట్ల సోదరభావంతో మెలగాలని, లైంగిక వేధింపులకు పాల్పడటం సరి కాదని శ్రీకాకుళం మానవ అక్రమ అక్రమ రవాణా విభాగం ఎస్ఐ సదాశివుని కేశవరావు అన్నారు. పట్టణంలోని నారాయణ కళాశాలలో శనివారం చైల్డ్ పోర్నోగ్రఫీ, బాలికలపై లైంగిక వేధింపులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. దిశా పోలీసులు, ఏహెచ్‌టీయూ, డీసీపీయూ, లేబర్, జాతీయ బాల కార్మిక విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్‌ను మంచి విషయాలు నేర్చుకోవడానికే ఉపయోగించాలని, పోర్న్ వెబ్‌సైట్లు చూడరాదని, అశ్లీల వీడియోలు చిత్రించరాదని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎల్‌పీ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలకృష్ణ, ఏహెచ్‌టీయూ ఎస్ఐ ఎల్.వెంకటరావు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, దిశా, ఏహెచ్‌టీయూ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఈఈ రాముకు డాక్టరేట్



రాము

అరసవల్లి: స్థానిక ట్రాన్స్‌కో ఈఈ ధారవత్తు రాముకు జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఈయన ది ఎఫెక్ట్స్ ఆఫ్ ఎలక్ట్రో మాగ్నటిక్ ఫీల్డ్స్ అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డి పూర్తిచేశారు. డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు గైడ్‌గా, డాక్టర్ రమేష్ కోగైడ్‌గా వ్యవహరించారు. రాముకు డాక్టరేట్ రావడంపై ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఉమాకవి, తిరుమలరావులకు ప్రశంసాపత్రాలు



ఉమాకవి, తిరుమలరావు

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా యూట్యూబ్ బడి సంస్థ 'ఇది తెలుగువారి బడి' పేరిట నిర్వహించిన పోటీలో బాలకథా నిలయం అధ్యక్షుడు ఉమాకవి, రాజాం రచయితల వేదిక సభ్యుడు కుదమ తిరుమలరావు ప్రతిభ కనబరిచారు. వీరికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందించారు.

రేపటి నుంచి ఎల్లమ్మ ఉత్సవాలు

నరుబుజ్జిలి: ఈ నెల 27, 28 తేదీల్లో మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బలగ సింహాచలం శనివారం తెలిపారు. 27న సిరి పోతన్న ఊరేగింపు, 28న ఎల్లమ్మ తల్లి జాతర ఉంటుందన్నారు. భక్తులు ఈ జాతరలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

భూసర్వే వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ

జి.సిగడాం: సమగ్ర భూసర్వే వేగవంతం చేయాలని భూ సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ బి.హనుమంతరావు, డీటీ ఎస్ఎస్ నిర్మల సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కప్పరాం, జగన్నాథపురం, నాయుడువలస, ఆనందపురం, నర్సింపురం గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తి చేసి పట్టాలు పంపిణీ చేశామన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ సర్వే వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో సర్వేయర్లు కృష్ణారావు, మొదలవలస పావని, సుంగవరపు గాయత్రి, పాట్నూరు హేమ వెంకట ప్రియ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షించాలి



స్వయంసేవక్ సభ్యులతో ముచ్చటిస్తున్న స్వామీజీ

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. బలగ నాగావళి నది తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ ఆలయం వద్ద రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, అనుబంధ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతిని తెలిపే గీతాన్ని ఆలపిస్తూ అందరితో పాడించారు. అంతకుముందు శతచండీ యాగం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామీజీని దర్శించుకున్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: విజయేంద్ర సరస్వతికి స్వాగతం పలుకుతున్న బాలభాస్కరశర్మ బృందం

దేవీ ఆశ్రమం సందర్శన

ఎచ్చెర్ల క్యాంపస్: కొంచాలకూర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమాన్ని శనివారం సాయంత్రం కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీ సందర్శించారు. శ్రీచక్రమేరువులతో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆలయ ప్రాధాన్యతను తెలియజేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న సాయిబాబా

ఎచ్చెర్ల: లింగాలపేటలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో సప్తమి వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కాగడ హారతితో పూజలు ప్రారంభించి పాలాభిషేకం, హోమం, అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ ధర్మకర్త, ట్రస్ట్ చైర్మన్ సనపల బాలకృష్ణ, నాయకులు దంతినాడ అప్పలాచారి, పతివాడ రమణ సింహాచలం, ఎంఎస్ నాయుడు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.